# మినీ కథ

# ఎంటర్ ది

—అది ఢిల్లీలోని క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ హెడ్ ఆఫీస్. పదహారంతస్తుల పెద్ద బిల్డింగ్.—

"మిస్టర్ విజయ్!"అంటూ కంచుగంట మోగినట్లు పలికింది డైరెక్టర్ కంఠం.

"ఎస్! సర్!!" అన్నాడు గంభీరంగా విజయ్.

విజయ్ క్రైంబ్రాంచ్ ఏజంట్లందరిలో సీనియర్. నేరస్తులయెడ జాలి, కరుణ, సానుభూతి మచ్చుకైనాచూపించని. క్రూరమైన వ్యక్తిత్వం కలవాడు. "పరల్ కిల్లింగ్ లైసెన్స్" నుండి 'కిల్లింగ్ లైసెన్స్' పొందిన మొట్టమొదటి వ్యక్తి. కరాటేలో సెవెన్త్ డిగ్రీ. వరల్డ్ కరాటే ఛాంపియన్‌షిప్‌కి తొలిసారిగా ఎన్నికైన ఇండియన్.

"నీకున్న కిల్లింగ్ లైసెన్స్ ఇంతకాలం తర్వాత ఉపయోగించాల్సిన అవసరం వచ్చింది. 'కిల్లర్స్ బ్యూరో' గ్యాంగ్ హైద్రాబాద్‌లో వున్నట్లు మన ఏజెంట్లు కనుక్కోగల్గారు. గ్యాంగ్ మొత్తాన్ని, ప్రాణాలతో ఒక్కడూ మిగలకుండా సర్వనాశనం చేయాలి. ఆ సంస్థలో 70 మంది వున్నారని అంచనా. ఇందులో 10,15 మంది మార్షల్ ఆర్ట్స్‌లో ఆరితేరిన వారున్నారు. అందుకే ప్రత్యేకించి ఈ కేసును నీకప్పగిస్తున్నాను" అన్నాడు డైరెక్టర్ పాల్.–

"ఇదిగో! ఈ ఫైల్‌లో నీకు కావలసిన పూర్తి సమాచారం వుంటుంది" అంటూ చిన్న ఆకుపచ్చని ఫైలు అందించాడు.

"ఈ కేసును తొందరలోనే ముగించే ప్రయత్నం చేస్తాను." అంటూ సెల్యూట్ చేసి, ఫైలు తీసుకొని బైటకు వచ్చేసాడు.

తను బైటకు వస్తూంటే 2 జతల కళ్ళు ఆసక్తిగా చూడ్డం గ్రహించి 'ఇప్పుడే శత్రువులు ఫీల్డ్‌లోకి దిగబోతున్నారన్నమాట'అనుకొని చిన్నగా నవ్వుకున్నాడు.

•

బేగంపేటలో 'కి... చు'మంటూ ఆగింది 'బోయింగ్ 007' విమానం. విజయ్ క్రిందికి దిగుతూ టైం చూసుకున్నాడు. పది నిముషాలు తక్కువ ఎనిమిది చూపిస్తోంది రేడియం వాచ్. చకచకా కష్టమ్స్ చెకింగ్ ముగించుకొని బైటికివచ్చి కనిపించిన ఒక ఆటో ఎక్కి 'హోటల్ రాజధాని' పోనీ అన్నాడు.

రూం నెం. 101 లోపలికి వచ్చాడు. ఫ్రెష్‌గా స్నానంచేసి, రూం బాయ్‌చేత మీల్స్ తెప్పించుకున్నాడు. తిన్నతర్వాత కాసేపు బెడ్ రెస్ట్ తీసుకున్నాడు. టైంచూసి పులిక్కిపడ్డాడు. 'అప్పుడే పదింబావయిందా'అని!

బ్రీఫ్‌కేస్ తెరిచి అందులోంచి 'ఎయిర్ బ్యాగ్' తీసుకున్నాడు. ఎయిర్ బాగ్ జిప్ తెరచి, బ్రీఫ్‌కేస్‌నుండి రెండు చుఱకత్తులు,

వి.యస్.పాణి.



# డ్రాగన్

## మినీ కథ

ఒక 'సంఛాకో', డైరెక్టర్ ఇచ్చిన గ్రీన్ ఫైల్ అందులో వుంచి బ్యాగ్‌జిప్ మూసేశాడు.

పైజమా, లాల్చీ ధరించాడు. ఎయిర్ బ్యాగ్ చేతబట్టుకొని బైటికి వచ్చాడు రిసెప్షనిస్ట్ ఆశ్చర్యంగా చూస్తుంటే నవ్వుకున్నాడు లోలోపలే!

రోడ్డు పైనున్న ఆటోను పిలిచి "దిల్‌సుఖ్ నగర్!" అని చెప్పాడు.

ముప్పావు గంట తర్వాత దిల్‌సుఖ్ నగర్ బస్టాండ్‌లో ఆగింది. ఆటో ఫేర్ చెల్లించి క్రిందికి దిగాడు. 'తన్నెవరూ అనుసరించడం లేదుకదా!' అని చుట్టూ పరికించి, సందేహ నివృత్తి చేసుకొని సూటిగా మెయిన్ రోడ్డమ్మట నడవసాగాడు 'చైతన్యపురి కాలనీ' దాటి రోడ్ ప్రక్కనున్న పిల్లబాటవైపు నడవసాగాడు. అర్ధరాత్రి కావస్తోంది. చకచకా నడవసాగాడు. ఫైలులో చెప్పిన గుర్తుల ప్రకారం 'కిల్లర్స్ బ్యూరో' స్థావరం దగ్గర కావస్తోంది. అక్కడ చిన్న చెరువుంది. కప్పలు బెకబెక మంటున్నాయి.

ఇంతలోనే గ్యాస్‌స్టవ్ మోత పెట్టినట్లు 'సిక్స్‌త్ - సెన్స్' వార్నింగివ్వసాగింది.

వెంటనే ప్రక్కకు తొలిగాడు. 'జుఫ్' మంటూ ఒక కత్తి గాలిని చీల[illegible] ముందుకు పోయింది. విజ[illegible]ంటి ప్రమాదాలు కొత్తకాదు.

కత్తి విసిరినతన్ని గమనించి 'ఎక్సర్‌సైజ్ పర్సనాల్టీ' అని గ్రహించి, 10 సెకన్ల వ్యవధిలో బ్యాగ్‌జిప్ తెరవడం, ఒకకత్తిని తీసి శత్రువుకేసి విసరడం జరిగిపోయింది. ఆ దృఢకాయుడు నోటమాట లేకుండా బస్తాలా కూలిపోయాడు. ఏం జరగనట్లుగానే ముందుకు నడుస్తూనే వున్నాడు విజయ్. రెండు నిముషాలు నడిచాడో లేదో 'హాండ్సప్' అన్న కంఠం విని, ఉలిక్కిపడ్డా తమాయించుకొని ఆగాడు. కనుచివర గుండా వెనుకనున్న వ్యక్తి తన రేంజ్‌లోకి వచ్చేదాకా వెయిట్ చేసాడు. అతను కాస్త దగ్గరికి రాగానే బుల్లెట్ స్పీడ్‌తో వెనక్కితిరిగి 'ఫ్రంట్ కిక్' ద్వారా అతని రివాల్వర్‌ను ఎగరగొట్టడం, అదే కాలుతో 'రౌండ్ హౌజ్ కిక్' రిలీజ్ చేయడం జరిగింది.

అతని గూబ గుయ్యిమంది. వెంటనే స్పృహ తప్పాడు.

అటువైపునుండి ఏడుగురు వ్యక్తులు రావడం కన్పించింది. అందరూ 'వైట్ కిమోనీ'లో వున్నారు. బ్లాక్ బెల్ట్స్ కట్టుకున్నారు. ఒక్కక్షణం వెనుదీసాడు. కర్తవ్యం అతని వీపును తట్టింది.

'స్పారింగ్ పొజిషన్'లోకి వచ్చాడు.–

ఒకడు మెరుపు వేగంలో విజయ్‌మీదికి 'ఫ్లయింగ్ సైడ్‌కిక్' రిలీజ్ చేసాడు. విజయ్ ఒకస్టెప్ ప్రక్కకువేసి 'ఎస్కేప్' అయ్యాడు. అతడు లాండ్ అవుతూ వుండగానే బిగ్గరగా షౌట్ చేస్తూ సైడ్‌కిక్ రిలీజ్ చేసాడు. ఇప్పుడు అతను రిలీజ్ చేసిన కిక్ ఎనిమిది టైల్స్‌ను పగలగొట్టగలదు. అంత బలంగా కిక్ కనెక్ట్ కావడంతో ప్రక్కటెముకలు విరిగి కూలబడ్డాడు.

వెనుకనుండి ఒకతను రావడం గమనించి 'బ్యాక్‌కిక్' గ్రాయిన్‌పై రిలీజ్ చేసాడు. రెండు తొడలమధ్య చేతులు పెట్టుకొని, మూల్గుతూ క్రింద పడిపోయాడు.–

మిగతా అయిదుగురు ఫైటర్స్ గ్రహించారు. 'ఇతను మామూలువ్యక్తి కాదు సీనియర్ బ్లాక్‌బెల్ట్ హోల్డర్' అని–

ఒకడు నైఫ్ తీసాడు, అలా తీసాడో లేదో విజయ్ విసిరిన నైఫ్ అతని కంఠంలో దిగబడింది.

ఒకడు చైన్, ఒకడు కర్ర, మిగతా ముగ్గురు మామూలుగానే దాడికి తయారయ్యారు.

'నుంఛాకో' తీసాడు.–

అందరూ స్తంభీభూతులయ్యారు దాన్ని చూసి– 'అమెరికా కరాటే అసోషియేషన్' వారు విజయ్‌కి ప్రత్యేకంగా బహూకరించిన వెపన్. రెండు స్టీల్ రాడ్స్‌తో చేయబడింది.

2 నిముషాలు గడిచాయి. నుంఛాకో తిరిగేచప్పుడు, 'ఫట్ ఫట్' మన్నచప్పుడు, దీనంగా ఆర్తనాదాలు, ఆ తర్వాత శవాలుగా అయ్యారు అక్కడి వ్యక్తులు.

కర్చీఫ్‌తీసి 'నుంఛాకో' పిడులకు అంటిన రక్తం తుడిచివేసి, బ్యాగ్‌లో ఉంచాడు–

మార్షల్ ఆర్ట్స్‌లో నిష్ణాతులైన పదిమంది కాస్తా 'హరే' మన్నారు. విజయ్‌కి పని సులభమనిపించింది. ఆనందం పట్టలేకపోయాడు

షౌట్ చేస్తూ 'ఫ్లయింగ్ కిక్' రిలీజ్ చేసాడు.

*

"ఏమిట్రా! 'య్యా!' అంటున్నావు" అన్న కంఠం విని కళ్ళు నులుముకుంటూ కలనుండి తేరుకున్నాడు విజయ్–" అబ్బ! ఎంత నాచురల్‌గా వుందీ కల! అనుకున్నాడు– నిన్న సెకండ్ షో టివోలిలో 'ఎంటర్ ది డ్రాగన్' చూసిన ఫలితం.–

వెంటనే 'మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్ సెంటర్'కెళ్ళి ఫీజు కట్టేశాడు. 10 రోజులు ప్రాక్టీస్ చేసేసరికి దవడలు పీక్కుపోయి, కళ్ళు బయటకు వచ్చాయి.

"అయ్యబాబోయ్! ఆ ట్రైనింగ్ వల్ల నా ప్రాణమే పోయేట్లుంది!" అనుకొని కరాటేకు ఒక దణ్ణం పారేసి, కరాటే నేర్చుకోవాలనుకున్న నిశ్చయానికి తిలోదకాలు ఇచ్చేసాడు.

